# క్రిమినల్స్

సూర్యదేవర రామ్మోహనరావు

17 సెప్టెంబర్ గురువారం...

అర్ధరాత్రి కావటానికి మరొక్క నిమిషమే వుందనగా వులిక్కిపాటుగా నిద్రలోంచి లేచాడు పరమశివం.

ఓసారి కళ్ళు నులుముకుని చీకట్లోనే నలువేపులా పరికించిచూశాడు ముందుగా ఏం కనిపించలేదు. చీకటికి అలవాటు పడేదాకా అలాగే చూస్తుండిపోయాడు. క్షణాలు నిముషాలయ్యాయి. అప్పుడే అతనికి స్పష్టంగా గదిలోని వస్తువులు కనిపిస్తున్నాయి.

మంచంమీంచి లేచి దేవుడి పటం దగ్గరకు నడిచి అక్కడున్న కిడ్డీబ్యాంకు బొమ్మను చేతిలోకి తీసుకుని రెండు మూడుసార్లు గాల్లో ఊపి చిల్లరనాణేలు చేసిన శబ్దాన్ని విన్నాడు

ఆ తరువాత చీకట్లోనే కిడ్డీబ్యాంకు మొఖానికి అతికించిన ఓ పసిపిల్లవాడి ఫొటో చూసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఉండుండి అతని కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. చీకట్లోనే ఆ బొమ్మను గుండెలకేసి అదుముకున్నాడు.

ఇప్పుడతని కళ్ళముందు ఓ పసివాడి అమాయకమైన మొఖం వెక్కి వెక్కి ఏడుస్తూ కనిపిస్తోంది. ఒక్కసారే పరమశివం నేలమీద కూలబడిపోయి చిన్నపిల్లాడిలా ఏడవటం ప్రారంభించాడు.

సరిగ్గా అదే సమయంలో ఊరికి అవతలగా వున్న చింతల తోపులో ఇద్దరువ్యక్తులు తమ మందీ మార్బలంతో మందుపార్టీలో పెట్రేగిపోతున్నారు.

"సరిగ్గానే దెబ్బ కొట్టానా?" మధుమూర్తి తడబడుతూ అడిగాడు ఎదురుగావున్న పట్టాభిని.

అప్పటికే మందును బాగా తలకెక్కించుకున్న పట్టాభి మహాదానందపడిపోతూ "భేష్ భేష్" అంటూ గంగిరెద్దులా తలూపాడు ఓ పక్క గ్లాసును వంపుకుంటూ.

0 0 0

"పోలీసాఫీసర్ అయ్యేవాడికి బుద్ధిబలం ఎంతుండాలో భుజబలం అంతే వుండాలి" మేజర్ మార్తాండ్ తన ఒళ్ళో కూర్చున్న తన పదేళ్ళ కొడుకు యుగంధర్‌కి ఉత్తేజం కలిగించేలా చెప్పుకుపోతున్నాడు.

"మీ కాలెందుకు పోయింది డాడీ అని అప్పుడప్పుడు అడుగుతుంటావ్ నువ్వు.

దేశభక్తి కోసం పణంగా పెట్టాను అని నేను చెబుతుంటాను. నీకర్థం అవుతుందో లేదో నాకు తెలియటం లేదు. ఆ దేశభక్తి అనేదానికోసం మనిషికి ఎంతో ముఖ్యమైన కాలును పోగొట్టుకుంటారా అని కూడా అడిగావోసారి. కాని మరెప్పుడూ అలా అడగవద్దు.

దేశంకోసం కేవలం కాలేనా పోగొట్టుకుంది మీరు అని అడగాలి. ఆ స్థాయికి నీవు ఎదగాలి" అంటూ యుగంధర్ తలమీద చేయివేసి ప్రేమగా నిమిరాడు అతను.

0 0 0

సరిగ్గా పై రెండు సంఘటనలు ఒకేరోజు వేర్వేరు ప్రాంతాల్లో జరిగాయి.

రాత్రంతా పరమశివం కంటిమీద కునుకులేకుండా కంటికి, మంటికి ఏకధారంగా విలపిస్తూనే వున్నాడు.

కాని... అతని కూతురు అంతా గమనిస్తూనే వుంది. ఆ చీకట్లోనే తండ్రినీ, తండ్రి చేతిలోని తమ్ముడి కిడ్డీబ్యాంకు బొమ్మను గమనిస్తూ తనూ ఏడుస్తోంది. లోలోపలే దిగమింగుకుంటోంది.

0 0 0

ఉదయం ఏడుగంటలు:

పరమశివం కిడ్డీబ్యాంకు బొమ్మను తన లాల్చిజేబులో వేసుకొని భార్యా, కూతురుకు ఏం చెప్పకుండానే గడపదాటి వడివడిగా ఎలిమెంటరీ స్కూల్‌కేసి సాగిపోయాడు.

"బాబూ, నీ పేరేంటమ్మా?"

పరమశివం అప్పుడే స్కూల్ నుంచి బయటకొచ్చిన ఒక కుర్రాడ్ని పక్కకు పిలిచి అడిగాడు

"నీకెందుకు?" అన్నాడా కుర్రాడు చికాకుగా జారిపోతున్న నిక్కరుని ఓ చేత్తో పైకి లాక్కుంటూ.

"ఏం లేదు బాబు! నీవు అచ్చం 'పసివాడి ప్రాణం' సినిమాలో నటించిన రాజాలా వున్నావ్ అందుకని" అన్నాడు పరమశివం చైల్డు సైకాలజీని ఆధారంగా చేసుకుని.

ఆ కుర్రాడి కళ్ళల్లో మెరుపు మెరిసింది.

"నా పేరు బాబు. రాజా అని మార్చుకోనా?" హుషారుగా అన్నాడా కుర్రాడు.

"అలాగే మార్చుకుందులే గాని, నీకు ఉదయ్ తెలుసా?" ఆత్రుతగా ఎదురుచూస్తూ అడిగాడు పరమశివం.

"తెలుసు, పేరు మార్చుకోనా?" మరలా ఉత్సాహపడ్డాడా కుర్రాడు.

పరమశివం ఆ కుర్రాడి సినిమాపిచ్చికి ఒకింత బాధపడ్డాడు.

"మార్చుకుందువు గాని, ఉదయ్ గురించి ఏమన్నా తెలుసా నీకు?" అతని కంఠంలో పితృహృదయం అడ్డుపడుతోంది.

"వాడు జైలుకెళ్ళాడు?"

"ఎందుకు?"

"పేరు మార్చుకోనా?" అమాయకంగా తిరిగి అదేప్రశ్న వేశాడు.

"మార్చుకుందువు గాని అని చెప్పాగా, ఉదయ్ జైలుకెందుకెళ్ళాడో చెబితే నీ పేరు మార్చుకునే సంగతి నేను చూస్తాను."

పదేళ్ళ బాబు చెప్పుకుపోతున్నాడు. పరమశివం అతను చెప్పేది శ్రద్ధగా వింటూ మధ్య మధ్యలో చాక్‌లెట్స్ అందిస్తున్నాడు. బాబు చెప్పేది వింటుంటే పరమశివానికి ఏడుపుతోపాటు పిచ్చి ఆవేశం పెరిగిపోతోంది.

మనసుని ఫొటో తీయగలిగిన యంత్రాన్ని ఏ శాస్త్రజ్ఞుడూ కనిపెట్టకపోవడం ఈ వ్యవస్థ అదృష్టం.

ఆ యంత్రమే వుంటే చరిత్రలో సంస్కర్త లనిపించుకున్నవాళ్ళు సైతం నేరస్తులుగా కనీసం ఓసారన్నా దొరికిపోతారు.

----

"రోజూ స్కూల్‌కి వెళ్ళే టైంకి ఓ సన్నగా వున్న అంకుల్ వచ్చి మీరు నిల్చున్న చోటే నించునేవాడు. ఉదయ్‌ని పిలిచి ఏదో మాట్లాడేవాడు" బాబు పరమశివం యిచ్చే చాక్‌లెట్స్ ఆత్రంగా తీసుకుని జేబులో కుక్కుకుంటూ చెప్పుకుపోతున్నాడు.

"ఆ అంకుల్ పేరేంటి?" పరమశివం ఆత్రుత పైకి కనిపించకుండా జాగ్రత్త పడుతూ అడిగాడు.

"పేరు తెలియదు"

"చూస్తే గుర్తుపడతావా?"

"గుర్తుపడతాను, ఇంకెన్ని చాక్‌లెట్స్ వున్నాయి మీ దగ్గర?"

"బోల్డున్నాయి. వూ... ఆ తరువాత?"

"ఉదయ్‌ని స్కూల్‌కి వెళ్ళకుండా తీసుకెళ్ళేవాడు"

"ఎక్కడికి?"

"సినిమాకి"

"సినిమాకా?"

"అవును, ఎంచక్కా రోజుకు రెండు సినిమాలు చూపించేవాడట. అవునకుల్ సినిమాలో చిరంజీవి కత్తిపెట్టి దొంగల్ని పొడుస్తాడు. ఐనా జైల్లో వేయరు గదా? మరి ఉదయ్‌ని ఎందుకేశారు?" బాబు అమాయకమైన మోములో ఆశ్చర్యం తొంగి చూసింది.

"మరి ఉదయ్ రోజూ స్కూల్‌కి వెళ్ళకుండా సినిమాకి వెళ్ళితే అటెండెన్స్ రిపోర్టులో రోజూ స్కూల్‌కి వచ్చినట్లు ఉందేం?" బాబు తలను ఆప్యాయంగా నిమురుతూ అడిగాడు పరమశివం.

"ఉత్త అబద్ధం అంకుల్! ఉదయ్ రోజు సాయంత్రం మామిడి తోపులో మాకు సినిమా కధలు చెబుతుండేవాడు".

పరమశివానికి ఒక్కో విషయమూ క్రమంగా అర్ధమవసాగింది.

"ఇంకేం చెప్పేవాడు?"

జరిగింది తెలుసుకోవాలంటే ఉదయ్ హత్యచేయటానికి ముందున్న మానసిక స్థితి తెలుసుకోవాలి.

"జనాల్ని కొడితే... అంతే ఫైటింగ్ చేయాలి! కొడితే సెకండ్ హీరో! చంపితే హీరో అవుతామని చెప్పేవాడు. సినిమాల్లో అలాగే చేస్తారట-ఉదయ్ చెప్పేవాడు".

ఆ పసిపిల్లవాడి మోములో ఆ వయస్సుకే ఏదో అర్థంలేని కసి..... ఏదో చేసి హీరో అనిపించుకోవాలనే ఆరాటం.

జాలేసింది పరమశివానికి ఆ బాబు మీద. పసిపిల్లల మనస్సులో విషబీజాలు నాటే చౌక బారు సినిమాలు ఈ వ్యవస్థలో రజతోత్సవాలు జరుపుకుంటున్నాయ్.

పరమశివం నిట్టూర్చాడు "ఇదిగో ఇలా చూడు బాబూ! ఈ ఫొటోల్లో నువ్వు చెప్పిన అంకుల్ వున్నాడేమో చూసి చెప్పు" అంటూ జేబులోంచి రెండు ఫొటోలు తీసి బాబుకి చూపించాడు.

బాబు ఆ రెండూ ఫొటోల్ని అటూఇటూ త్రిప్పి చూసి తల అడ్డంగా ఊపాడు లేరన్నట్లు. విషయం కొంత అర్థం కాగానే చేతిలో వున్న చాక్లెట్స్ అన్నీ బాబు చేతిలో పెట్టి వస్తానన్నట్లు సైగ చేసి ముందుకు సాగిపోయాడు.

"నా పేరు మార్చుకోనా అంకుల్"

వెనుకనుంచి వినిపిస్తున్న బాబు మాటల్ని పట్టించుకోనట్లు వడి వడిగా అడుగులేశాడు పరమశివం.

"సరిగ్గా పదిహేను రోజులక్రితం మీ థియేటర్‌లో ఏ సినిమా అడింది?" పరమశివం టూరింగ్ టాకీస్ గేట్‌మేన్‌ని అడిగాడు.

అతను చిరాకుగా చూశాడు. వెంటనే పరమశివం జేబులోంచి ఎస్ బీడీ కట్టతీసి అందించాడు. అతని మొఖం ప్రసన్నంగా మారింది.

వెంటనే ఆరు నెలల నుంచి తమ థియేటర్‌లో ఆడిన సినిమాల పేర్లన్నీ చెప్పేశాడు గుక్క త్రిప్పుకోకుండా.

పరమశివం అక్కడి నుంచి బయలుదేరాడు. పరమశివం కిడ్డీబ్యాంకు బొమ్మను తదేకంగా చూస్తూ నాలుగయిదు చోట్ల తాను సేకరించిన వివరాల్ని మనసులో పొందికగా పేర్చుకుంటూ వెళ్తున్నాడు.

మధుమూర్తి, పట్టాభి ఏ దారయినా సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్నవాళ్ళు. పరమశివం ఒకింత పాపభీతి, పాపపుణ్యాల లెక్కల్ని చూసుకునేవాడు.

ఓ రోజు అర్థరాత్రి మామిడితోపులో ఆ ముగ్గురు కూర్చొని మందు కొడుతూ దెబ్బతిన్న వ్యాపారం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

"ఈ దెబ్బ నుంచి తేరుకోకపోతే మనం వీధులెంట అడుక్కుతినవలసిందే" పట్టాభి నిస్పృహగా అన్నాడు

"ఎలా తేరుకుంటాం? నిండా మునిగిపోయాం కదా? మధుమూర్తి అడుగుతున్నాడు, ఓ పక్క జరిగిన నష్టాన్ని మర్చిపోయేందుకు కసిగా త్రాగుతూ.

"నేనప్పుడే చెప్పాను. అలాంటి వ్యాపారాలు మనకొద్దని మీరు వినలేదు" దిగులుగా అన్నాడు పరమశివం.

"ఛత్.... నువ్వు మాట్లాడకు, అసలే కొంప కొల్లేరయి మేమేడుస్తుంటే నువ్వేంటీ మధ్యలో వేమన శతకాలు వల్లిస్తావ్?" పట్టాభి కసురుకున్నాడు పరమశివాన్ని.

పాలిథిన్ పేకింగ్ మెటీరియల్ తయారుచేయటం లాభసాటి వ్యాపారమే కాని.... మధుమూర్తి ఆలోచనలు ఆ వ్యాపారంతో ఆగిపోలేదు. ఫ్యాక్టరీ వెనుక అడవిలా వున్న ప్రాంతాన్ని ఎవరికీ తెలియకుండా చదును చేయించి మొక్కల్ని నాటించాడు.

నాటిన రోజునుంచి ఆ వేపుకి ఎవరూ పోకుండా దుర్గాదాసుని కాపలాగా పెట్టాడు. ఆ విషయం పట్టాభికి తప్ప పరమశివానికి తెలియదు.

గంజాయి మొక్క ఎంతో దూరంలో వున్నా ఓ రకమైన వెగటు వాసన వస్తుంటుంది. అందుకే గంజాయి మోక్క వాసనను కాంపెన్‌సేట్ చేసేందుకు మరో కొత్తరకం మొక్క తెప్పించి వాటిమధ్య వేసేందుకు ప్లాన్ చేశాడు.

గంజాయితోట క్రమగా పెరగనారంభించింది. దాంతో పాటు మధుమూ ర్తిలో

ఆందోళన కూడా పెరగసాగింది.

మరి కొద్దిరోజులు పోతే గంజాయి మొక్క వాసన గాలిలో ప్రయాణించి తమ ఉనికిని బయట ప్రపంచానికి తెలియజేస్తుంది. లక్షలు లాభం తెచ్చిపెట్టే మొక్కలే దెయ్యాలయి తమను పీక్కుతింటాయి. ముందు ఆ వాసన కంపెనీలో అందరికీ, బీడీల వర్కర్స్‌కి తెలిసిపోతుంది. వాళ్ళు ఏ క్షణాన ఆ వార్తను లీక్ చేసినా అందరికీ బేడీలు పడటం ఖాయం.